


'ఫైర్ అండ్ సేఫ్టీ'పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ఫైర్ అండ్ సేఫ్టీ కార్యశాల' శుక్రవారం నిర్వహించారు. దీని ప్రాముఖ్యతను సన్ రైజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజినీర్స్ డైరెక్టర్, శిక్షకుడు జి. భాస్కర్ రావు విద్యార్థులకు వివరించారు. దేశ విదేశాల లో సేఫ్టీ ఇంజినీర్స్ కోర్స్ చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ కోర్సుపై అవగాహన పెంచుకుంటూ విద్యతో పాటు గా ఇటువంటి సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి సిహెచ్ వెంకట లక్ష్మి, మెకానికల్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

రమాప్రభకు పెరుగుతున్న ఆదరణ


250 ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ● ముచ్చెమటలు పడుతున్న అధికార, ప్రతిపక్షాలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు విశేష ఆదరణ లభిస్తోంది. ప్రచారంలో ఆమెకు, ఆమె మద్దతుదారులకు అడుగడుగునా స్వాగతం లభిస్తోంది. సుమారు 250కిపైగా ఉద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక, ప్రజా సంఘాలు రమాప్రభకు మద్దతు ప్రకటించాయి. వారంతా ఆమె గెలుపును ఆకాంక్షిస్తూ రోజూ ప్రచారం చేస్తున్నారు. దీంతో, వైసిపి, టిడిపి అభ్యర్థులకు, ఆయా పార్టీల బాధ్యులకు ముచ్చెమటలు పడుతున్నాయి. బిజెపి ఉనికి కూడా ఎక్కడా కనిపించని పరిస్థితి. కోరెడ్ల రమాప్రభ పట్ల ఆదరణకు అనేకు కారణాలు కనిపిస్తున్నాయి. ఆమె ఉన్నత విద్యావంతురాలు కావడంతోపాటు మహిళలు, పట్టణాల్లోని మురికివాడల ప్రజానీకం, గిరిజనులు, మత్స్యకారులు, పేదలు తదితర తరగతుల స్థితిగతులపై అధ్యయనం చేయడంతోపాటు వారి అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారు. ఆమె కుటుంబ సభ్యులంతా ప్రజాపోరాటాలతో పెనవేసుకు పోయినవారే. మరోవైపు ప్రజల పక్షాన నికరంగా పోరాడే పిడిఎఫ్ బలపర్చింది. పిడిఎఫ్ చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో మొదటి రెండు దఫాలూ పిడిఎఫ్ బలపర్చిన ఎంవిఎస్ శర్మే గెలిచారు. ఆ తరువాత అతితక్కువ ఓట్లతో గెలిచిన బిజెపి అభ్యర్థి గడిచిన ఆరేళ్లలో పత్తాలేరు. అలాగని ప్రభుత్వాలపై పోరాడి సాధించిందీ లేదు. ఇక వైసిపి ప్రభుత్వం ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులకిచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ముఖ్యంగా ఉద్యోగులకు పిఆర్‌సి ఇవ్వడానికి మీనమేషాలు లెక్కించింది. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రద్దు చేస్తామన్న సిపిఎస్ గురించి ఇప్పుడు కనీసం మాట్లాడడం లేదు. అధికారంలోకి వచ్చిన ప్రతి జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కనీసం ఒక్క డిఎస్సీ కూడా తీయలేదు. పైగా వివిధ శాఖల్లో ఖాళీ అయిన పోస్టులను కూడా భర్తీచేయలేదు. దీంతో, నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. డిగ్రీలు, పీజీలు పూర్తిచేసినవారు పొట్టకూటికోసం ఇతర రాష్ట్రాలు పోవాల్సిన పరిస్థితి దాపురించింది. విద్య కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగమవుతున్నాయి. పాఠశాలల్లోనూ, హాస్టళ్లలోనూ ఇప్పటికీ తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడం, మెస్ ఛార్జీలు తగినంతగా పెంచకపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

వీటన్నింటిపైనా పోరాడిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూ గృహ నిర్బంధాలు, అక్రమ కేసులకు పాల్పడుతోంది. ఇంత జరుగుతున్నా ప్రతిపక్షంలోవున్న టిడిపి కనీసం నోరు మెదిపిన పాపాన పోలేదు. బహుశా అందుకేనేమో ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థి టిడిపి పేరు చెప్పుకోవడానికి కూడా ఇష్టపడడం లేదు. విద్యావేత్తగా చెప్పుకుంటున్న ఆ అభ్యర్థి చరిత్రలో ఉచితంగా విద్యనందించిన సందర్భం మచ్చుతునక కూడా కనిపించని పరిస్థితి. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల నడుమ పట్టభద్రులను లోబరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ అటువంటి పాచిక పారే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో పట్టభద్రులంతా డాక్టర్ కోరెడ్ల రమాప్రభవైపే మొగ్గు చూపుతున్నారు.



ప్రయివేటు విద్యాసంస్థల అధ్యాపకులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ (ఫైల్)

పోలింగ్ స్టేషన్లలో బిఎల్‌ఒల సేవలు

48 గంటల పాటు డ్రై డే ● జోనల్ అధికారుల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ రోజున బిఎల్‌ఒల సేవలను పోలింగ్ స్టేషన్ల వద్ద వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి సూచించారు. అందుకు సంబంధించి తహశీల్దార్లకు ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసామని తెలిపారు. ఛాలెంజ్ ఓట్లు , ఓటర్లను గుర్తించడానికి , ఓటింగ్ ప్రశాంతంగా జరగడానికి వీరి సేవలను వినియోగించాలన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా జోనల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి , పోలింగ్ స్టేషన్ల పరిశీలించిన తర్వాత ఏర్పాట్ల పై వారి అభిప్రాయాలను స్వీకరించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రవేశానికి , బైటకు వెళ్లేందుకు వేర్వేరు గా మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువగా ఓటర్లు ఉన్న చోట మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్ల వద్ద నీడతో పాటు , తాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ఏజెంట్ లకు పోలింగ్ బూత్ వద్ద ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ బూత్ లోకి ఎటువంటి మొబైల్ ఫోన్ లు కాని, కెమెరాలు కాని తీసుకు వెళ్లకూడదని స్పష్టం చేసారు. విఐపి లు ఓటింగ్‌కు వచ్చేటప్పుడు వారి సెక్యూరిటీ లు, పిఎలను కూడా లోపలికి అనుమతించరాదని, ఒక్క ఓటర్ మాత్రమే వెళ్లాలని అన్నారు. సాయంత్రం 4 గంటలతో ఓటింగ్ ముగించాలని, 4 గంటలకు క్యూ లో నున్న ఓటర్లకు చిటీలు ఇవ్వాలని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియలో పిఒ డైరీ అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ నిబంధనలను అనుసరించి డైరీ రాసేలా చూడాలని జోనల్ అధికారులకు సూచించారు. ఎన్నికల విధులలో నున్న అధికారులంతా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకొని, వారి ఓటు ను వినియోగించుకోవాలన్నారు.

48 గంటల పాటు డ్రై డే

పోలింగ్ 13 తేదీన జరగనున్నందున 11 వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి వేసి ఉంచాలని, డ్రై డే గా పాటిస్తూ ఉత్తర్వులను జరీ చేయాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో డిఆర్ఒ గణపతి రావు, డిప్యూటీ కలెక్టర్ డి.వెంకటేశ్వర రావు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల దోపిడీ

రవీంద్రభారతి స్కూల్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-శృంగవరపుకోట



రవీంద్ర భారతి పాఠశాలలో ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకుండానే 2023 -24 విద్యా సంవత్సరానికి గాను ప్రయివేటు పాఠశాలలలో దోపిడీ మొదలైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని రవీంద్రభారతి స్కూల్లో పుస్తకాల పేరుతో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆ స్కూల్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టానికి, విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా తొమ్మిదో తరగతి చివరి పరీక్షలు రాయకుండానే 2023-24లో పదో తరగతి పుస్తకాలు అమ్ముతూ, వేలకు వేలు దోచుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల విద్యార్థులు పుస్తకాలు కొనలేని కారణంతో విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న మండల విద్యాశాఖాధికారి పి.సత్యనారాయణ.. పుస్తకాలు అమ్ముతున్న గదిని సీజ్ చేయించారు. పుస్తకాలను ఎంఆర్‌సి కార్యాలయానికి తరలించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, ఎస్.కోట మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్, కె.రమేష్, నాయకులు రాము, రిషి, జీవన్, ఎర్నాయుడు పాల్గొన్నారు.

డబ్బులిచ్చుకో... ఇల్లు కట్టుకో

- అమ్మిగారి కోనేరుగట్టుపై అక్రమ నిర్మాణాలు
- నిర్మాణదారుల నుంచి వసూళ్లు
- ఆక్రమణలపై వైసిపి కౌన్సిలర్ల అభ్యంతరం

ప్రజాశక్తి-బొబ్బిలి



అమ్మిగారికోనేరు గట్టుపై చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు

పట్టణంలో మున్సిపల్ అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలూ చేపట్టకూడదు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. కానీ పట్టాలు లేకపోయినా, అనుమతులు రాకపోయినా అమ్మిగారి కోనేరుగట్టుపై నిర్మాణాలు చేయాలంటే అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ చేతులు తడపాల్సిందే. చెరువుగట్లపై ఎటువంటి నిర్మాణాలూ చేపట్టకూడదని వాల్టా చట్టం చెపుతున్నా బొబ్బిలి మున్సిపాలిటీలో అమలు కావడం లేదు. అమ్మిగారి కోనేరు గట్టును కొంతమంది ఆక్రమించేసి అధికార పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్‌కు ఆమ్యామ్యాలు చెల్లించి, గట్టుపై అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో అమ్మిగారి కోనేరు ఉంది. కోనేరు చుట్టూ గట్టు ఆక్రమణకు గురైంది. గతంలో ఆక్రమణ స్థలంలో రేకిళ్లు, పూరిళ్లు నిర్మించుకుని జీవనం సాగించేవారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గట్టుపై ఆక్రమణదారులు నుంచి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ అక్రమ వసూళ్లకు పాల్పడి పక్కా భవనాలు నిర్మించుకోవాలని చెప్పడంతో ఆక్రమణదారులు పిల్లర్లు వేసి భవనాలు నిర్మించుకుంటున్నారు.

తాత్కాలికంగా బ్రేక్

కోనేరుగట్టుపై ఇళ్లు నిర్మిస్తున్న ఆక్రమణదారుల నుంచి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కోనేరుగట్టు ఆక్రమణదారులకు ఇళ్ల పట్టాలు లేదా పొజిషన్ పట్టాలు ఇప్పిస్తామని చెప్పి ఒక కౌన్సిలర్ డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. గట్టుపై ఉన్నవారికి పట్టాలు లేదా పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేసినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఏమి చేయాలో తెలియక ఆక్రమణ స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే, మున్సిపల్, రెవెన్యూ అధికారుల నుంచి అభ్యంతరం రాకుండా చూసుకుంటామని కౌన్సిలర్ చెప్పడంతో గట్టుపై పిల్లర్లతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు.

గట్టుపై అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో కొంతమంది వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. కోనేరు గట్టుపై ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో అక్రమ నిర్మాణాలు నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.



వేధింపులపై ఆరా తీస్తున్న బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు

న్యాయవాది ఇంటికి బాలల హక్కుల కమిషన్

ప్రజాశక్తి-విజయనగరం

భార్యను ఏళ్ల తరబడి బంధించిన న్యాయవాది మధుబాబుపైనా, తన కుమారుడిని అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన సోదరుడు దుర్గాప్రసాద్‌పైనా వారి భార్యలు పోలీసులకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి.హిమబిందు కంటోన్మెంట్‌లోని వారి ఇంటిని శుక్రవారం పరిశీలించారు. జరిగిన ఘటనలపై ఆరా తీశారు. ఇంట్లో ఉంటున్న పిల్లలతోను, వారి నాన్నమ్మతోను మాట్లాడి వారి సంరక్షణపై తీసుకుంటున్న చర్యలు గురించి చర్చించారు. పిల్లలను తల్లికి దూరం చేయొద్దని సూచించారు. ముగ్గురు పిల్లలకు, నాన్నమ్మ ఉమాదేవికి కూడా సిబ్బంది కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులతో పిల్లలను విడదీయరాదని, వారి రక్షణ, సంరక్షణ లోనే ఉండాలని అన్నారు. పాఠశాలకు పంపిస్తూ చదువుకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. వారితో పాటు జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు భవాని, సుధారాణి పట్నాయక్, బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ, సిబ్బంది యాళ్ల నాగరాజు, సంధ్య పాల్గొన్నారు.

5న చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కృష్ణా, అనకాపల్లిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఈనెల 5న ఎంపికలు జరుగుతాయని చెస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ పోటీలు రింగ్‌రోడ్డులోని ఫైర్ చెస్ స్కూల్‌లో జరుగుతాయని తెలిపారు. అండర్-7 క్రీడాకారులు 2018 జనవరి 1, అండర్-17 క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా తమ జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని తెలిపారు. ఓపెన్‌లో ఇద్దరు, బాలికలలో ఇద్దరు క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.పేర్లు నమోదు కోసం 9490948730, 9703344488 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పిడిఎఫ్ గెలుపుతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-డెంకాడ



అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుత్ను ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించడం ద్వారా ఉత్తరాంధ్ర వాణిని శాసనమండలిలో వినిపించి అభివృద్ధికి బాటలు వేయవచ్చునని ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. రమాప్రభను గెలిపించాలని కోరుతూ శుక్రవారం రఘు ఇంజినీరింగ్ కాలేజీలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, ప్రొఫెసర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పిడిఎఫ్ గెలుపు..ఉత్తరాంధ్రకు మలుపు వంటిదని, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం శాసనమండలి వేదికగా కృషి చేసేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకోవడం శోచనీయమని అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని గతంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బందికి ఒక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులను, హెల్త్ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కదిలించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ బి.గంగారావు, కె.సురేష్, సిహెచ్. వెంకటేష్, రామకష్ణ తదితరులు ఉన్నారు.

మెంటాడ : మండలంలో జక్కువ, ఇప్పలవలస, అమరాయివలస, జయితి గ్రామాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు రాకోటి రాములు, తామరాపల్లి సోములు, అప్పలనర్సయ్య ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి వారితో మాట్లాడారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాకోటి రాములు కోరారు.

ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

వంగర : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాజాంలోని ఓ కళ్యాణ మండపంలో శుక్రవారం 'ఉద్యోగుల హామీలు - అమలుతీరు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితులలోను జిపిఎస్‌ను ఉద్యోగ సంఘాలు అంగీకరించబోవని అన్నారు. పిఆర్‌సి, సకాలంలో డిఎలు మంజూరు విషయంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వైసిపి ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోయిందని అన్నారు. ఉద్యోగులు తమ హక్కులను కాపాడుకోవాలంటే ఉమ్మడి ఉద్యమాలు సరైన మార్గమని అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె. బాలమురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రసాంత కుమార్, రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం, సిఐటియు నాయకులు సిహెచ్ రామ్మూర్తినాయుడు, న్యాయవాది శ్యాంప్రసాద్, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు ఎం.జితేంద్రరావు, జెవివి నాయకులు పి.వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది హడావుడి మాత్రమే

విజయనగరం కోట : పెట్టుబడులు, అభివృద్ధి అంటేనే గుర్తొచ్చేది టిడిపి అని ఆ పార్టీ జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడులను ఆకర్షించి పెద్ద ఎత్తున ఉపాధి కల్పించి ఉమ్మడి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది చంద్రబాబు అనే కొనియాడారు. మన రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలని, యువత ఉద్యోగాలు పొందాలని రాష్ట్రం బాగుండాలని అన్నారు. నాలుగేళ్ల నుంచి ఒక రూపాయి కూడా పెట్టుబడులు తీసుకురాని ఈ ప్రభుత్వం ఇప్పుడు 'గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్' పేరుతో హడావిడి చేసినంత మాత్రాన సాధించేది ఏంటి అని ఎద్దేవా చేశారు. సమావేశంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, బొద్దుల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

9 ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నియామకం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఏప్రిల్ 3 నుండి 18 వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఛాంబర్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 25 మండలాల్లో 127 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 24,099 మంది రెగ్యులర్ అభ్యర్థులు, 1,428 ప్రైవేటు అభ్యర్థులు మొత్తం 25,527 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుండి 12.30 వరకు పరీక్ష జరుగుతుందని అన్నారు.

పరీక్షల కేంద్రాలను తహశీల్దార్లు, ఎంపిడిఒ లు తనిఖీ చేసి ప్రతి రోజూ జిల్లా కల్లెకర్ కు నివేదికలు అందజేయలన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు జరిగేలా తహశీల్దార్లు చూడాలన్నారు. 9 ప్లైయింగ్ స్క్వాడ్లను తహశీల్దార్ల ఆధ్వర్యంలో వేస్తున్నట్లు త్లిపారు. ప్రశ్నా పత్రాల కస్టోడియన్ గా జిల్లా రెవిన్యూ అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ పూర్తయ్యేవరకు స్ట్రాంగ్ రూమ్ అయిన కోట హైస్కూల్ వద్ద పోలీస్ బందోబస్త్ ఉండాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద తాగు నీటి సరఫరా ఉండాలని, వైద్యశాఖ ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి గణపతి రావు, డిఇఒ లింగేశ్వర రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి, డిఎస్‌పి శేషాద్రి, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి కుమారి, విద్యుత్ శాఖ ఎస్ఇ, డిప్యూటీ డిఇఒలు ఆర్‌టిసి ఆర్ఎం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్మపురి సబ్‌స్టేషన్ మరమ్మత్తు పనులు జరుగుతున్నందున శనివారం ధర్మపురి, ప్రదీప్ నగర్, వసంత్ విహార్, పద్మావతి నగర్, బియ్యాలపేట, ఎస్‌విఎన్ నగర్, నోబుల్ నగర్, కొత్త ధర్మపురి, కమల నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఇ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయనికి ప్రజలు సహకరించాలని కోరారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని తాండ్ర పాపారాయ బొమ్మ వద్ద నుంచి మార్కెట్ రోడ్డు, చింతాడ వీధి, యాత వీధి, బెస్తా వీధి, కుమ్మరి వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. మురుగునీటి కాలువలు, రోడ్లపై చెత్త ఉండడంతో పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. కుమ్మరివీధిలో వృత్తిదారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వమిచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమ, సిబ్బంది పాల్గొన్నారు.



రేషన్ డిపోలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సిఐ సింహాచలం

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని 128, 133, 208 నంబర్ల రేషన్ దుకాణాలలో శుక్రవారం విజిలెన్స్ సిఐ సింహాచలం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 133 నంబర్ డిపో డీలర్ గోవింద్ దుకాణంలో బియ్యం 601 కిలోలు, చక్కెర 24.5 కిలోలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. 128 నంబర్ డిపో డీలర్ సనివాడ అప్పారావు దుకాణంలో బియ్యం 6,472 కిలోలు, కందిపప్పు 2 కిలోలు, చక్కెర 25 కిలోలు తక్కువగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేశామన్నారు. 208 నంబర్ డిపోలో ఎలాంటి తేడాలూ లేవని చెప్పారు. 128వ నంబర్ డిపోను మరో డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ డిటి మూర్తి, విఆర్‌ఒలు రమణ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని గుళ్ళపాడు పంచాయతీ వండానపేటలో శుక్రవారం పల్లివాని చెరువు పనులను అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సంకాబత్తుల హరినాథ్ పరిశీలించారు. కూలీలకు వేసిన మస్తర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలన్నారు. కొలతలు ప్రకారం పని చేస్తే రూ. 257 కూలి వస్తుందన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఎన్ఎంఎంఎస్ యాప్ లో తప్పనిసరిగా హాజరు , ఫొటో అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయని తెలిపారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

సచివాలయ సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం సిబ్బందితో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సమీక్ష నిర్వహించారు. సఖి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేపట్టిన సేవా కార్యక్రమాలపై ఆరాతీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు చేయాలన్న విషయాన్ని గుర్తెరిగి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సచివాలయ కార్యదర్శి బి.మణి, సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రజాశక్తి-వేపాడ

నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని చిన్నగుడిపాలలో శుక్రవారం మహిళా రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. పచ్చిరొట్ట సాగువల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.సన్యాసమ్మ, వెంకటరావు, రామస్వామినాయుడు, రమణమ్మ, విఎఎ ఎం.ప్రసాద్, సర్పంచ్ బోజంకి రామునాయుడు పాల్గొన్నారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి-బలిజిపేట రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నూతన పైపులైన్ పనులు చేపట్టనుండడంతో ఈ నెల 5, 6న తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆది, సోమవారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేతకు ప్రజలు సహకరించాలని కోరారు. నీటిని పొదుపుగా వాడాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ఆయిల్ పాం సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని శ్రీ లక్ష్మీ బాలాజీ పామాయిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్లాంట్ మేనేజర్ పి.రమేష్ అన్నారు. మండలంలోని చోళపదం సమీపంలో శ్రీ లక్ష్మీబాలాజీ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తూనిక కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫ్యాక్టరీ పరిధిలో గల మండలంలో 11 తూనిక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు తూనిక కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయని ఇప్పటికి రెండు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల కోసం పామాయిల్ గెలల బరువులో తగ్గుదల లేకుండా వెంట వెంటనే తూనిక వేయడం జరుగుతుందన్నారు. దీంతో రైతులకు నష్టం లేకుండా ఉంటుందని అన్నారు. ఫ్యాక్టరీకి తాజాసరుకు సరఫరా జరగడంతో పాటు రైతులకు దిగుబడి పెరిగి రవాణా ఖర్చు తగ్గి రాబడి పెరుగుతుందన్నారు. రైతులు తమ సొంత మనుషులతో సొంత బండిపై రవాణా చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఈ తూనిక కేంద్రం ఏర్పాటు వలన త్వరగా కేంద్రం పరిధిలో గల 15 గ్రామాల్లో 50 మంది రైతులకు 350 హెక్టార్ల విస్తీర్ణంలో గల తోటలకు సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ఈ కేంద్రం పరిధిలోని చిన్న రైతులు పామాయిల్ పంట తోటలు సాగు చేయుటకు ఇది మంచి సదావకాశమని అన్నారు. రైతులు కోసిన పామ్ ఆయిల్ గెలలు వెంటనే తూనిక వేయడంతో బరువు తగ్గకుండా రైతుకు ఆదాయం సమకూరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, కేంద్రం నిర్వహకులు ఉన్నారు.

టేకు అక్రమ రవాణా

అనుమతులు లేకుండా టింబర్ డిపోలకు తరలింపు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలో టేకు అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రాజాం - పాలకొండ ప్రధాన రహదారిలో సంకిలి, ఉంగరాడమెట్ట, బూరాడ మీదుగా రాజాం, పొందూరు టింబర్ డిపోలకు ట్రాక్టర్లతో టేకు రవాణా చేస్తున్నా, దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా టేకు కలప ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నా పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. టేకును చిన్న శిర్లాం, తాటిపాడు జంక్షన్, రాజాం, పొందూరు తదితర ప్రాంతాల్లోని టింబర్ డిపోలకు తరలిస్తున్నారు. వాస్తవంగా టేకు తరలిస్తే రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరి. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ధ్రువపత్రాలతో కలప రవాణా చేయాలి. అలా కాకుండా, అనుమతులు లేకుండా రేయింబవళ్లు ప్రధాన రహదారుల మీదుగా ట్రాక్టర్లతో టేకు తరలిస్తున్నారు. టేకు అక్రమదారులు రూ.లక్షల్లో కాసులు వెనకేసుకుంటున్నారు. వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. టేకు అక్రమ రవాణా సాగుతున్నా ప్రతి చెక్ పోస్ట్ వద్ద ముడుపులు చెల్లించడంతో వదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు స్పందించి టేకు అక్రమ రవాణాకు అడ్డకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో ట్రాక్టర్‌తో అక్రమంగా తరలిస్తున్న టేకు

దాడులు చేపడతాం

టేకు అక్రమ రవాణాపై నిఘా ఉంచాం. ఫిర్యాదులు వస్తున్నాయి. రాత్రివేళల్లో అక్రమ రవాణా చేయడంతో పోలీసులు సహకారంతో దాడులు చేస్తాం. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి, యజమానులపై కేసులు పెడతాం. ఇప్పటికే ఉంగరాడమెట్ట, బూరాడ జంక్షన్లో పోలీసుల సహకారంతో తనిఖీలు చేపడుతున్నాం.. సచివాలయ స్థాయి విఆర్ఒలకు సమాచారం అందించాం.

-టి.కళ్యాణ చక్రవర్తి, తహశీల్దార్

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం

నెల్లిమర్లలోని ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన, తాళాలను, సీళ్లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నెల్లిమర్ల తహశీల్దార్ రమణరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నీలకంఠరావు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

అనంతరం కొండగుంపాం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో వివిధ అంశాలను గురించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నారో పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కలిస్తూ విలువైన సూచనలు అందించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.



గోదాం సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

సిటియులో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి గా విచ్చేసిన సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఎమెరిటస్ ప్రొఫెసం, డాక్టర్ చిలుకూరి శాంతమ్మ మాట్లాడుతూ స్త్రీ పురుషులు ఇరువురూ సమానమేనని అన్నారు. జీవిత ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన మగవారందరికి ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టమణి మాట్లాడుతూ పురుషుడి ప్రతి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందని చెప్పారు. తన జీవితం లో కూడా తన తల్లి, భార్యలకు ఒక సముచిత స్థానం ఉందని అన్నారు. కార్యక్రమం మహిళా సెల్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీదేవి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి జ్యోతిని వెలిగించి ప్రారంభించగా విద్యార్థులు వివిధ సాంస్కతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



శాంతమ్మను సత్కరిస్తున్న సిటియు విసి కట్టమణి

మహిళలు దేనిలోనూ తీసిపోరు

మహిళలు దేనికీ తీసుపోరని, ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం, అన్నిట సగమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాడు ఓ ప్రైవేటు అతిథి గృహంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇన్నర్ వీల్ క్లబ్ సమాజ హితం కోసం చేస్తున్న కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. మహిళల స్థితిగతులు మారనిదే సమాజం అభివద్ధి చెందదని అన్నారు. విధి రాతను ఎదిరించి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తూ ఎందరో నారీమణులు చరిత్ర సష్టించారని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఎదిగేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను ఉచిత రీతిన సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో రామాలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని రెండోరోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో సీతారాముల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, బుద్ధ అప్పలనాయుడు దంపతులు, యువ కిషోర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. తొలి పది స్థానాల్లో నిలిచిన వాటికి నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జబర్దస్త్ బృందం సందడి చేసింది.



వేదికపై సందడి చేస్తున్న జబర్దస్త్ నవీన్, అప్పారావు

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గర్భిణులకు, తల్లీబిడ్డలకు పౌష్టికాహారం అందించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గదుల వెంకటరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారికి వినతినిచ్చారు. జిల్లాలో ఏ ఆసుపత్రి చూసినా రక్తహీనత కేసులు నమోదు అవుతున్నాయని అన్నారు. కాన్పు సమయంలో రక్తం చాలక చాలామంది ప్రసవం కష్టమవుతుందని తెలిపారు. రక్తం లేని కారణంగా చాలామంది గర్భిణులను విశాఖ కెజిహెచ్, ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని తెలిపారు. రేపటి రాబోయే తరాలు బాగుండాలంటే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, బిసి సంఘం కార్యదర్శి పందిరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న మహిళా దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-రామభద్రపురం

ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మహిళా సంఘాల సభ్యులు విజయవంతం చేయాలని ఎపిఎం గాడి వెంకటరమణ కోరారు. ఈ మేరకు వైకెపి కార్యాలయంలో మహిళా సంఘాల నాయకులు, సభ్యులతో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

దిశ యాప్‌పై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-వంగర

గ్రామాలలో మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల చదువు, ఆరోగ్యం పట్ల మహిళా పోలీసులు పూర్తి భద్రత వహించాలన్నారు. బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలకు ఎటువంటి సమస్యలున్నా వారికి అండగా నిలవాలని తెలిపారు.

ఘనంగా గంధ మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సూఫీ మహాత్మ హజరత్ ఖాదర్ షా ఖాదర్ వలి 64వ గంధ మహోత్సవం స్థానిక బాబామెట్ట దర్బార్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా నఖీబుల్ ఔలియా సూఫీ పీఠాధిపతి హజరత్ ముహ్మద్ అతావుల్లా షరీఫ్‌షా ఖాదరీ బాబావారి ఆధ్యాత్మిక వారసులు సజ్జాద నషీన్ ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా ఖాదరి బాబా దర్గా, దర్బార్ ముతావలి డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, ఎమ్‌డి జాఫర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఫకీర్ మేళాతో ఊరేగింపుగా మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. జెండా మహోత్సవంతో బయలుదేరిన రథం దారిపొడుగునా భక్తులకు కనువిందు కలిగించింది. తప్పెటగుళ్లు, పులివేషాలు, బ్యాండ్ పార్టీలతో నగరం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా సజ్జాద నషీన్ ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా మాట్లాడుతూ మానవులు రెండే జాతులని స్త్రీ, పురుష బేధం తప్ప మరేం లేదని అన్నారు. ఉత్సవాల్లో డిప్యూటీ మేయర్‌కోలగట్ల శ్రావణి, జనసేన నాయకులు గురాన అయ్యలు తదితరులు పాల్గొన్నారు.



రథంతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఖలీలుల్లా షరీఫ్, తదితరులు

గ్యాస్ ధర పెంపుపై నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని శుక్రవారం పట్టణంలోని జెండా మహల్ సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి అధికారంలో రాకముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200కు చేరిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు వై.బాబ్జి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ పిలుపుమేరకు డిపో అధ్యక్షుడు ఎఎస్ రావు అధ్యక్షతన శుక్రవారం ఎస్.కోట డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాను మూర్తి మాట్లాడుతూ 17 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఒటి, నైట్ అవుట్ అలవెన్స్‌లను వెంటనే చెల్లించాలని, జీవో నెంబర్ 114 ప్రకారం అలవెన్స్ చెల్లించాలని. డిపోలో అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.కోటేశ్వరరావు, యూనియన్ నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన 50 వాహనాలకు వేలం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసుశాఖ వినియోగించి, కాలం చెల్లిన 50 పోలీసు వాహనాలను ఈ నెల 13న ఇ-వేలం వేయనున్నట్లు ఎస్పి ఎం.దీపిక తెలిపారు. జిల్లా పోలీసుశాఖ వినియోగించి, కాలంచెల్లిన 50 పోలీసు వాహనాలను 7 లాట్లుగా విభజించా మన్నారు. వాహనాల వేలం ఆన్లైనులో నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు https://konugolu.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి బిడ్డింగ్ వేయాలన్నారు. వేలం వేయాల్సిన 50 పోలీసు వాహనాలు ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్నాయని, ఆసక్తి కలిగిన వేలందార్లు వాహనాలను ఎంటిఒ, ఎల్.శ్రీనివాసరావు ఫోను నంబరు 9121109486, ఎం.టి. మెకానిక్ ఫోను నంబరు 9440070857ను సంప్రదించి, వాహనాలను పరిశీలించుకోవచ్చునని తెలిపారు.



చుక్కనీరు రాని కుళాయిలు

అలంకారప్రాయంగా కుళాయిలు

చుక్క నీరు రాక అవస్థలు

ప్రజాశక్తి-శృంగవరపు కోట

మండలంలోని చుక్కవానిపాలెంలో ఇంటింటి కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. చుక్క నీరు రాక తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో చుక్కవానిపాలెంలో ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన కొద్ది రోజులు మాత్రమే తాగునీరు సరఫరా చేశారు. తర్వాత నీరురాక కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి.



గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న స్థానికులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జామి

జామి మండల కేంద్రమైన మాధవరాయకాలనీ వద్ద లారీ ఢీకొని బొడ్డవర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఎస్ఐ వీరబాబు స్పందించి ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆవ్యక్తిని స్థానికుల సహాయంతో ఎస్ఐ ప్రథమ చికిత్స చేయించారు. 108 వాహనం వచ్చినంత వరకు ఎదురు చూడకుండా ఆటో రప్పించి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. సగం దూరం వెళ్లాక, 108 వాహనం ఎక్కించి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. అయితే అతడు అపస్మారక స్థితిలో ఉండడంతో వివరాలు తెలియలేదు. లారీని ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు.